


ఊరగుట్ట ఆక్రమణదారులపై ఫిర్యాదు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఊరగుట్టను ఆక్రమించిన వారిపై ఫిర్యాదు చేసినట్టు తహశీల్దార్ షబ్బీర్ బాష, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ పాఠశాలకు 5 ఎకరాలు ఎస్టీలకు 20 ఇండ్లకు, శ్మశాన వాటికలకు స్థలాన్ని కేటాయించారని దీనిని శని, ఆదివారాల్లో గ్రామానికి చెందిన ఏకాంబరం నాయుడు ట్రాక్టర్లు, జెసిబిలు పెట్టి చదును చేశారని దీనిపై కేసు నమోదు చేయాలని తహశీల్దార్, ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌కి కాపీలను పంపినట్టు తెలిపారు.


From
1. Sri S Shabbir Basha, Tahsildar, Bangarupalyam.
2. Principal, APTWR School (Boys), Bangarupalyam.

To
The Station House Officer, Bangarupalyamss,

Roc.: A/355/2025, dt:15.12.2025.

Sir,

Sub:- Lands – Chittoor District – Palamaner Division Mogili Village- Compliant against illegal encroachment at Sy. No. 61 Ex: 3.83 & Sy no.372 Ex: 0.99 Mogili revenue village- Requesting to take necessary action-

Ref:- 1. Roc. L2/e 481423/2024 Dt: 15/04/2025.
2. Proceeding No. D.Dis CoorSA/48960/2025 Dt: 17.03.2025.
3. Roc No. A/61/2025 Dt: 21/01/2025.
4. Roc. No. A/62/2025 Dt: 20/02/2025.
5. Enquiry report from Village Revenue Officer, Mogili, Bangarupalyam.
6. Information Received From the Principal, APTWR School (Boys), Bangarupalyam.

We invite kind attention to the reference cited.

It is found that on Sunday Dt: 14.12.2025, The villagers of Mogili, Bangarupalyam, informed me that there is an encroachment at revenue village Mogili, Bangarupalyam Sy.no 61 Ex: 3.83 & Sy no.372 Ex: 0.99 by P Ekambaram Naidu S/o P Peddabba Naidu.

On the above issue Village Revenue Officer and Village Surveyor visited the field and found that on Sunday Dt: 14.12.2025 in the revenue village Mogili, Sy.no 61 Ex: 3.83 & Sy no.372 Ex: 0.99 in the land which was previously allotted to "AP Tribal Welfare Residential School (Boys) To Construct new Residential building, and also ST's House site layout for 20 houses, Burial Ground" has been encroached by P.Ekambaram Naidu S/o P.Peddabba Naidu, R/o Mogili Village, Bangarupalyam with JCB or Tractor, the said encroacher was fled from the field along with earth movers before enquiry officers Village Revenue Officer and Village Surveyor arrival. Please register compliant to take necessary action.

PRINCIPAL
A.P.T.W.R. SCHOOL (Boys)
BANGARUPALEM
CHITTOOR DIST. 517 416

Tahsildar
TAHSILDAR
BANGARUPALYAM (Md)
Chittoor Dist.

1.Copy submitted to the District Collector, Chittoor for kind information.
2.Copy submitted to the Revenue Divisional Officer, Palamaner for kind information.

Sir,
Received
on 15/12/2025 at 5.37PM
INSPECTOR OF POLICE

ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ప్రకటన పై...

టిడిపి క్యాడర్‌లో అసంతృప్తి..!

● తిరుపతి నుంచి పనబాక లక్ష్మి ● చిత్తూరు నుంచి షణ్ముగం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చిత్తూరు, తిరుపతి జిల్లాలో టిడిపి అధ్యక్షుల పేర్లు ప్రకటించడంలో అధినేత చంద్రబాబు నాయుడుపై టిడిపి క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తుంది. తిరుపతి అధ్యక్షులుగా ప్రకటించిన కేంద్ర మాజీమంత్రి పనపాక లక్ష్మి, చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులుగా ప్రకటించిన షణ్ముగం క్యాడర్‌ని కలుపుకొని పోయే పరిస్థితి భవిష్యత్తులో ఉండదని తేల్చి చెప్తున్నారు కొందరు సీనియర్ నాయకులు. ఇంతమాత్రానికి అధిష్టానం సర్వేలు నిర్వహించి.. ఆలోచించి.. ప్రకటించిన పేర్లపై కార్యకర్తలు కారాలు మిరియాల నూరుతున్నారు.. వీరి నాయకత్వంలో పార్టీ దిగిజారుడే తప్ప అభివృద్ధి ఉండదని బాహాటంగానే మాట్లాడుకోవడం కనిపించింది.. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా తాము సూచించిన వ్యక్తులకు పార్టీ అధ్యక్షులు రాకపోవడంతో లోలోనే నిరసన వ్యక్తం చేస్తున్నారు.


పనబాక లక్ష్మీ


షణ్ముగం

గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాల అధ్యక్షులు నరసింహ యాదవ్, సిఆర్ రాజన్ పదవీకాలం ముగియడంతో వారికి రాష్ట్రస్థాయి కార్పోరేషన్ పదవులు కట్టబెట్టి అధిష్టానం సంతృప్తిపరిచింది. రెండు జిల్లాలు 6 మంది మంత్రులతో కూడిన బృందం పార్టీ అధ్యక్షులు పైన సమావేశ నిర్వహించింది.. పార్టీ జిల్లా మహాసభలు కూడా జరుపుకున్నారు.. అయితే ఇరు జిల్లాలో డజన్ కొద్దీ అధ్యక్ష పదవికి పోటీ రావడంతో అధ్యక్షులు నియమించే బాధ్యతను అధినేత నారా చంద్రబాబు నాయుడు అప్పగించారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐవైఆర్ సర్వే నిర్వహించారు.. తిరుపతి జిల్లా నుంచి అధ్యక్ష పదవికి తెలుగు యువత రాష్ట్ర నాయకులు శ్రీధర్ వర్మ, మాజీ అధ్యక్షులు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు నెలవల సుబ్రహ్మణ్యం, పరసా రత్నం, శ్రీకాళహస్తి చెందిన టిడిపి నాయకులు గురువారెడ్డి, సూళ్లూరుపేట చెందిన సతీష్ రెడ్డిలు పోటీలో ఉన్నారు.. యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని చంద్రబాబుకు లోకేష్‌కు నేరుగా చెప్పారు.. అంటే పరోక్షంగా శ్రీధర్ వర్మకు ఇవ్వాలని పట్టుబట్టారు.. అలాగే చిత్తూరులో మాజీ అధ్యక్షులు సిఆర్ రాజన్, యువ నాయకులు సప్తగిరి ప్రసాద్, ఎంపీ ప్రకాష్ నాయుడు, జడ్పీ మాజీ చైర్మన్ గీర్వాణి భర్త ప్రకాష్ నాయుడు, సతీష్ నాయుడు మరో ఆరు మంది పోటీపడ్డారు.. అయితే ఎవరికి పదవి దక్కలేదు.. చిత్తూరులో యువత కన్వీనర్‌గా ఉన్న పుత్తూరుకు చెందిన షణ్ముగంకు చిత్తూరు జిల్లా అధ్యక్ష పదవి దక్కింది.. ఇటు తిరుపతి అటు చిత్తూరు జిల్లాలో నాయకులు కార్యకర్తల్లో అధిష్టానం ప్రకటించిన అధ్యక్షులుపైన బహిరంగగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.. రాష్ట్రవ్యాప్తంగా టిడిపి అధ్యక్ష పదవులను 26 జిల్లాల్లో రిజర్వేషన్ ప్రాతిపదికన పదవులు కట్టబెట్టినట్టు టిడిపి అధిష్టానం ప్రకటించినప్పటికీ టిడిపి క్యాడర్‌లో ఉత్సాహం అనేది కనిపించలేదు.. చంద్రబాబు ప్రకటనపైన టిడిపి అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా టిడిపి అధ్యక్షులుగా ప్రస్తుత టిటిడి బోర్డు మెంబర్ పనపాక లక్ష్మిని ఎస్సీ రిజర్వ్ కింద ప్రకటించినట్లు అధిష్టానం చెబుతుంది.. చిత్తూరులో షణ్ముగంను బీసీ రిజర్వేషన్ కింద ప్రకటించామని నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.. టిటిడి బోర్డు మెంబర్‌గా ఉన్న పనపాక లక్ష్మి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండకూడదు.. మరి ఆమె ఆ పదవికి రాజీనామా చేసి పూర్తిస్థాయి ప్రత్యక్ష రాజకీయాలు జిల్లా అధ్యక్ష పదవి చేపడతారా అనేది తెలియాల్సి ఉంది.

ఎంపీపీలకు అందని గౌరవ వేతనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రజలచేత ప్రజల కొరకు ప్రజాసామ్యబద్ధంగా ఎన్నుకోబడిన మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు నాలుగేళ్ళుగా గౌరవ వేతనం ఇవ్వకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎంపిపిల గౌరవేతనం విషయం పట్టించుకోకపోవడంతో నాలుగేళ్ళుగా వారు గౌరవేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవేతనాలు జిల్లా పరిషత్ సభ్యులు, ఎంపీటీసీలకి ఇచ్చారు దీంతో ఎంపీపీల గౌరవేతనం మరిచారు.



ఎంపిటీసీలు, ఎంపీపీల పదవీకాలం మరో ఆరు నెలల్లో ముగియనున్న నేపథ్యంలో నెలకు తమికిచ్చే రూ.6వేల గౌరవేతనం కూడా చెల్లించలేని స్థితిలో ప్రభుత్వముందా అని ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 మండలాల్లో 65మంది ఎంపిపీలున్నారు. ఇందులో 50 శాతం మహిళా ఎంపీపీలు అంటే 32 మంది మహిళా ఎంపీపీలు ఉన్నారు. ఒక్కొక్క ఎంపిపీకి నాలుగేళ్ళ గౌరవేతనం రూ. 2,88,000లు చొప్పున ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

గత జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మహిళా ఎంపీపీలు జిల్లా కలెక్టర్, జెడ్పి ఛైర్మెన్, జెడ్పి సిఈఒకు తమకు ఇవ్వాల్సిన గౌరవేతనం చెల్లించాల్సిందిగా కోరారు. ప్రభుత్వం నుండీ గౌరవేతనం చెల్లింపుపై ఎలాంటి ఆదేశాలు అందలేదని సమాధానంతో తమ పదవీకాలం మరో ఆరునెలల కాలంలో ముగియనుందని, తరువాత అయినా తమకు అందాల్సిన గౌరవేతనం ఇస్తారా... లేదా.. అనే సందేహాన్ని వారు వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తమకు ఇచ్చే అతి తక్కువ గౌరవేతనం కూడా ఇవ్వకపోవడం ఏమిటని ఎంపిపీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత వైసిపి ప్రభుత్వంలో రెండేళ్ళ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రెండేళ్ళ కలిపి నాలుగేళ్ళ తమకు గౌరవేతనం చెల్లించాలని జిల్లాలోని మండలపరిషత్ అధ్యక్షులు కోరుతున్నారు. జిల్లా పరిషత్ నిధుల ద్వారా చెల్లించాలంటున్నారు. మరోవైపు జిల్లాలో వైసిపి ప్రజాప్రతినిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదంటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మినీ గోకుళం షెడ్ల మంజూరు విషయంలోనూ స్థానిక ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా అధికార పార్టీ ప్రజాప్రతనిధులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణనులున్నాయి. ప్రభుత్వం సంక్షేమ పథకాల విషయంలో పార్టీలకు అతీతంగా స్థానికంగా ఉన్న సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపిపీ, జెడ్పిటీసీలను ఆహ్వానించాలని కోరుతున్నారు.

నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్ణంగా ఉన్న పనులకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. ప్రహరీగోడలు, మరుగుదొడ్లు, కిచ్చెన్‌షెడ్లు అసంపూర్ణంగా నిలిచిపోయాయి. ఇలా అగిపోయిన నాడు-నేడు పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని, గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్లీనిక్‌లు అనేకం అసంపూర్ణంగా ఆగిపోయాయని వీటిని పూర్తి చేయాల్సిన అవసరముందని జిల్లాలోని వైసిపి జెడ్పిటీసీలు, ఎంపిపీలు కోరుతున్నారు.

కొనసాగుతున్న గజ దాడులు

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ ఎర్రమిట్ట గ్రామ సమీపంలో రైతులు బండపై ఆరబెట్టి ఉంచిన వరి ధాన్యాన్ని మూడు ఏనుగులు సోమవారం అర్ధరాత్రి దాడి చేసి వడ్లు తిని ప్లాస్టిక్ పట్టలను ధ్వంసం చేసి మిగిలిన ధాన్యాన్ని చిందరవందర చేసి నష్టం కలిగించాయి. హుస్సేన్ అనే రైతుకు చెందిన ధాన్యాన్ని బండపై పగలు ఎండకు ఆరబెట్టి రాత్రులలో ధాన్యాన్ని రాశి పోసి దానిపై ప్లాస్టిక్ పట్టాలను కప్పి ఉంచాడు. రాత్రి వేళల్లో వచ్చిన మూడు ఏనుగులు ధాన్యాన్ని కొంతమేర తిని పట్టలు చింపివేసి మిగిలిన ధాన్యాన్ని బండపై చెల్లాచెదురు చేశాయి. మంగళవారం ఉదయం వెళ్లి పరిశీలించిన రైతు తనకు జరిగిన నష్టాన్ని గుర్తించి అటవీ శాఖ సిబ్బందికి తెలియజేశారు. ఎఫ్‌బిఓ రాధ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించి సదుం నుండి పదిమంది ట్రాకర్లు వదిలే వారిని రప్పించి ఉదయం 11 గంటల నుండి మధురమలై కొండ ప్రాంతంలోకి ఏనుగులను తరిమేందుకు చర్యలు తీసుకున్నట్లు రైతులు తెలిపారు. నారు పోసినప్పటి నుండి వరి పైరు ఏపుగా పెరిగి వరి కోత యంత్రాలతో కోసి ఇంటికి చేర్చే వరకు రైతు వేల రూపాయల పెట్టుబడులు పెడుతున్నారు. అయితే ఏనుగులు రైతుల కష్టాన్ని నష్టంగా మార్చి కంట నీరు తెప్పిస్తున్నాయి. శాశ్వత పరిష్కారం కోసం రైతులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోతోంది. ఏనుగుల వల్ల కలిగిన నష్టాన్ని రైతులకు నష్టపరిహారంగా ప్రభుత్వం అందిస్తోంది తప్ప ఏనుగుల బెడద నివారణ కోసం తీసుకున్న చర్యలు శూన్యం. ఇకనైనా ఏనుగుల బెడద నివారణ కోసం శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.


ధాన్యాన్ని చల్లా చెదురు చేసి పట్టలు చింపివేసిన ఏనుగులు

203 అదనపు పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

జిల్లాలో 15,75,899 మంది ఓటర్లు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్


జిల్లాలో ఈ తేదీ నాటికి 15,75,899 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని నాగార్జున ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో వివిధ రాజకీయపార్టీ ప్రతినిధులతో ఎన్నికల సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా బోగస్, మరణించిన వారిని జాబితా నుండి తొలగించి పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించవచ్చు అన్నారు. జిల్లాలో 1776 పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో బిఎల్‌ఓలకు ఈ ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ బిఎల్ఏ ద్వారా పరిశీలించవచ్చునని తెలిపారు. దీనితో పాటు రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన బోగస్, మరణించిన వారి వివరాలను బిఎల్‌ఓలకు తెలిపి ఓటరు జాబితా నుండి తొలగించే కార్యక్రమానికి సహకరించాలని కోరారు. సంబంధిత బిఎల్వోలు 70శాతం మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ తేదీ నాటికి జిల్లాలో 7నియోజకవర్గంలో కలిపి 15,75,899 మంది ఓటర్లు ఉన్నారని, 18 సంవత్సరాల వయసు పూర్తి అయిన నూతనంగా ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ సంతృప్తికరంగా కొనసాగుతున్నదన్నారు. అంతకుముందు కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవిఎం గోడౌన్‌లను తనిఖీ చేశారు. ఈవీఎంలు, వివిట్యాప్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్ కుమార్, టిడిపి ప్రతినిధి సురేంద్ర కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి పరదేశి, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, బీఎస్పీ పార్టీ సురేంద్ర, వైఎస్ఆర్ పార్టీ ప్రతినిధి ఉదయ్ కుమార్, సిపిఎం పార్టీ ప్రతినిధి గంగరాజు, ఎలెక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేంద్ర పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

రేణిగుంట విమానాశ్రయంలో

రాష్ట్ర గవర్నర్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి తిరుపతి జిల్లాకలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఘన స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా 16వ తేదీ మంగళవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహంకు చేరుకున్నారు. స్వాగతం పలికిన వారిలో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్ ఉన్నారు.



వనరులు పొదుపుగా వినియోగించుకోవాలి




ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సహజ ఇంధన వనరులు పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని కట్టమంచి వివేకానంద విగ్రహం నుండి విద్యుత్ ఆదాపై అవగాహన ర్యాలీని కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్తును పొదుపుగా వినియోగిస్తే ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇందనం పొదుపులో మంచి ఫలితాలు సాధించుచున్నదని తెలిపారు. జిల్లాలో 200 మెగా కిలో వాట్స్ ద్వారా పీఎం సూర్యమర్ పథకం ద్వారా నిర్మాణం పనులు చేపడుతున్నామని తెలిపారు. అందరం కలిసి పనిచేస్తే విద్యుత్ పొదుపు వలన 5000 మెగా వాట్స్ పొదుపు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ భవనాలలో పీఎం సూర్యమర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఆదాయం చేసుకోవచ్చని తెలిపారు. విద్యుత్ పొదువు లక్ష్యంగా కృషి చేయాలని, భావితరాల దృష్ట్యా విద్యుత్తును ఆదా చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదువుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సోలార్ ఇ రూఫ్ టాప్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని ప్రజలను కోరారు. పీఎం సూర్యమర్ స్టాల్స్ ద్వారా సోలార్ విద్యుత్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పి.అయ్యుబుఖాన్ డైరెక్టర్, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, విద్యుత్ అధికారులు ముని చంద్ర, సురేష్ పాల్గొన్నారు.

టిటిడికి రూ.60లక్షలు విరాళం

ప్రజాశక్తి- తిరుమల: టీటీడీ వివిధ ట్రస్ట్‌లకు రూ.60లక్షలు విరాళం అందింది. సోమవారం తిరుమలలోని టిటిడి క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బిఆర్.నాయుడుని దాతలు కలిసి విరాళాలు డిడిలను అందజేశారు. ఈ మేరకు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు బెంగుళూరుకు చెందిన దాతలు కె.ఎన్.నయన, వి.ప్రభా, ఎస్.రాజేష్, కె.ఎన్.సందీప్ కుమార్, గుంటూరుకి చెందిన దేవరశెట్టి రితిష్, దేవరశెట్టి సత్యనారాయణ రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.60లక్షలు విరాళాన్ని డిడిల రూపంలో అందజేశారు. దాతలను ఛైర్మన్ అభినందించారు.



మల్బరీ రైతులకు మరింత ప్రోత్సాహం

మల్బరీ షెడ్ల ఏర్పాటుకు ప్రభుత్వ రాయితీ
75 శాతం రాయితీతో పెద్ద రీల్ యూనిట్ : ఏఎంసీ ఛైర్మన్ జిఎం రాజు

ప్రజాశక్తి - కుప్పం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మల్బరీ రైతులకు మరింత ప్రోత్సాహకాలు అందిస్తోందని, మల్బరీ సాగును మరింత పెంచాలని కుప్పం ఏఎంసీ ఛైర్మన్ జిఎం.రాజు పేర్కొన్నారు. కుప్పం సిరికల్చర్ కార్యాలయాన్ని మంగళవారం రాజు తనిఖీ చేయడంతో పాటు అధికారులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో మల్బరీ సాగు గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మల్బరీ రైతులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను రైతులకు తెలియజేశారు. ప్రస్తుతం సాగులో వున్న 5238 ఎకరాలను 1063 షెడ్‌లను మరింత పెంచి రైతులు ఆర్థికంగా ఎదుగుదలకి కృషి చేయాలన్నారు. సీఎం చంద్రబాబు భగీరథ ప్రయత్నంతో కుప్పంకు కృష్ణా జలాలు వచ్చిందని ఇక్కడ చెరువులు కృష్ణా జలాలతో కల కళలాడుతోందని రైతులు మల్బరీ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.


పట్టుగూళ్లను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ జిఎం.రాజు

సబ్సిడీతో మల్బరీషెడ్ల ఏర్పాటు

రైతులు మల్బరీ షెడ్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోందని, పెద్ద షెడ్డుకు రూ.3.37లక్షలు, చిన్న షెడ్డుకు రూ.2.47లక్షలు, నారు నాటడానికి రూ.22,500లు ఎకరాకు కూటమి ప్రభుత్వం సబ్సిడీ రూపేణా అందజేస్తుందన్నారు. కుప్పం నియోజకవర్గంలో పెద్ద రీల్ యూనిట్స్ కూడా ప్రభుత్వం 75శాతం సబ్సిడీ ఇస్తుంది. యూనిట్ కాస్ట్ రూ.1.5 కోట్లకు గాను రూ.1.12 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ అందిస్తుందని కాబట్టి రైతులు ముందుకు రావాలన్నారు. లేటెస్ట్ టెక్నాలజీతో 3 కొత్త రీలింగ్ యూనిట్స్ కూడా త్వరలో కుప్పం నియోజక వర్గంలో అందుబాటులోకి వస్తుందని దీంతో పట్టుగుళ్ల రేట్లు సైతం పెరిగి రైతులకు మరింత ఆదాయం వస్తుందన్నారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, డైరెక్టర్లు ఇర్ఫాన్, తులసి, ఏడీ మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

22న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

మామిడి రైతుల అసోసియేషన్ పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వం ప్రకటించిన మేరకు కిలో మామిడికి మామిడి గుజ్జు పరిశ్రమలు, ర్యాంపులు రూ.12లు ఇవ్వాలని కోరుతూ ఈనెల 22వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మామిడి రైతుల అసోసియేషన్ పిలుపునిచ్చింది. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సి.మునీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన మామిడి రైతు సంఘం విస్త ృతస్థాయి సమావేశం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులు మునీశ్వర్ రెడ్డి, బంగారు మురళి మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమలు మామిడి రైతులకు ఇవ్వాల్సిన రూ.8లు వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 40 వేల మంది రైతులకు చెల్లించాల్సిన రూ.360 కోట్లు వెంటనే చెల్లించాలని, కలెక్టర్, వ్యవసాయ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడిరైతులందరూ కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు పాల్గొని మాట్లాడుతూ మామిడి రైతుల పోరాటానికి సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ప్రభుత్వం అధికారులు కలెక్టర్ ఇచ్చిన ప్రోసిడింగ్స్ ప్రకారం కేజికి రూ.8లు ఇచ్చేంతవరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. నాయకులు సురేంద్రన్, హేమలత, మునిరత్నం నాయుడు, ఉమాపతి నాయుడు, మోహన్ రెడ్డి, సందీప్ ఉమాపతిరెడ్డి, త్యాగరాజురెడ్డి, చంగ్రాయిరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మామిడి సంఘం నాయకులు

హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్‌ఓ


రికార్డులను పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్‌ఓ

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి మంగళవారం నగరి నియోజకవర్గ పరిధిలోని పుదుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రికార్డులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఎన్సీడీ సర్వే ప్రతిరోజు కచ్చితంగా క్వాలిటీగా చేయాలని వైద్యులకు సూచించారు. అలాగే అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రతిరోజూ మానిటర్ చేస్తూ లాప్స్ ఉన్న వాటిని రెక్టిఫై చేసి అన్ని ఆప్స్‌ను వందశాతం పూర్తి చేయాలన్నారు. యూపీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. యుపిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ బిందు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మెప్మా పీడీ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): స్థానిక ఏజేఎస్ కళ్యాణ మండపంలో సఖీ సురక్ష పథకంలో భాగంగా మంగళవారం మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మెప్మా పీడీ రవీంద్ర ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పీడీ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నేషనల్ అర్బన్ మిషన్ కింద థైరాయిడ్, షుగర్, విటమిన్ లోపం, సర్వైకల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, హైజీనిక్ కేన్సర్, ఎనీమియా, ప్రోటీన్ లోపం, మెంటల్ ఇల్‌నెస్ కౌన్సిలింగ్ వంటి 16రకాల టెస్ట్‌లు చేస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మెప్మా ద్వారా నిర్వహిస్తున్న సఖీ సురక్ష స్క్రీనింగ్ టెస్ట్‌లు ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ఈ క్యాంప్ పెట్టడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో 530 మంది మహిళలు బ్లడ్ శాంపిల్ ఇచ్చి పరీక్షలు చేసుకొన్నారు. ఈ శిబిరంలో విజయవాడ నుండి విచ్చేసిన వైద్యసిబ్బంది వైద్యసేవలు అందించారు. అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్ హిమబిందు, మెప్మా సీఎంఎం ప్రసాద్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్లు, హెల్త్ రిసోర్స్ పర్సన్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్న లేబర్ ఇన్స్పెక్టర్ మధుబాబు

లేబర్ ఇన్స్పెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండల కేంద్రమైన చౌడేపల్లిలో మంగళవారం పుంగనూరు లేబర్ ఇన్స్పెక్టర్ మదిగొండరు అధికారులతో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఫ్యాన్సీ స్టోర్లు, స్వీట్లు మెకానిక్ దుకాణాలు, టీ దుకాణాలు, జ్యువెలరీ షాపులు వంటివి తనిఖీ చేశారు. ఒక ఫ్యాన్సీ స్టోర్లో సక్రమంగా లైసెన్సు చెల్లించలేదంటూ నోటీసులు జారీ చేస్తామని లేబర్ ఇన్స్పెక్టర్ మధుబాబు తెలిపారు. అదే దుకాణంలో పనిచేసే మహిళలకు తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని సైతం నోటీసులు ఇస్తున్నామని ఆయన వివరించారు. బాల కార్మికులను ఎవరూ పనిలోకి తీసుకోకూడదని, ఎవరైనా అలా చేస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. అనంతరం పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కేశవరెడ్డి, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు సులోచన, రాధ, పోలీసు ఏఎస్ఐబ్బ్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు బంగారుపాళెం విద్యార్థిని ఎంపిక


జాతీయ బాస్కెట్ పోటీలకు ఎంపికైన నీలీషా

ప్రజాశక్తి -బంగారుపాళెం: జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని నీలీషా ఎంపికైనట్లు పీడీ గిరిజ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 23 వ తేదీ నుంచి 26వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా చిన్నతిప్పసముద్రంలో రాష్ట్ర స్థాయి అండర్-14 బాస్కెట్‌బాలు పోటీలు నిర్వహించారని, ఈ పోటీలలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నీలీషా పాల్గొని ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ నెల18 వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న బాస్కెట్‌బాల్ పోటీలలో రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని నీలీషాను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర, ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, పీడీ గిరిజతో పాటు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు రాజకీయ పార్టీలతో ఎన్నికల సమావేశం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వివిధ రాజకీయ పార్టీలతో నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి వెంకట శివ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తహశీల్దారు శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు గంగాధర నెల్లూరు నియోజక వర్గంలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం నూతన విధి విధానాలను తెలిపేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజక వర్గంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు హాజరు కావాలని కోరారు.

స్వదేశీ వస్తువులే వినియోగించాలి

పెనుమూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్ అలీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: స్వదేశీ వస్తువులే ప్రజలు వినియోగించాలని కూటమి మహిళ నాయకురాలు భాగ్యలక్ష్మి, పెనుమూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్ అలీ అన్నారు. కూటమి నాయకులు తూగుండ్రం పంచాయతీలో స్వదేశీ వస్తువులు వాడకంపై మంగళవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశీ వస్తువులు వాడకాన్ని ప్రజలు వీడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ సెల్ కార్యదర్శి శాంతకుమార్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షులరెడ్డి, కూటమి నాయకులు సుందరరాజు, మురళి, ఆనంద్ రెడ్డి, హరి ప్రసాద్ పాల్గొన్నారు.


ఆటల పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులు

రాష్ట్ర ఆటల పోటీలకు దివ్యాంగ విద్యార్థులు

ప్రజాశక్తి -ఎస్ఆర్‌పురం:

మండ లం లోని 49 కొత్తపల్లి మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో చదు వు తున్న దివ్యాం గ విద్యార్థులు జిల్లా స్థాయి ఆటలలో ప్రతిభను ప్రదర్శిం చి రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎన్నికై వారిని ఉపాధ్యాయులు అభినందించారు. గత శుక్రవారం చిత్తూరు మెసానికల్ గ్రౌండ్‌లో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల ఆటల పోటీలలో (పారా ఒలంపిక్స్) డిస్కస్ త్రోలో వి హాసిని 9వ తరగతి, షాట్ పుట్ పోటీలో 9వ తరగతి విద్యార్థి ఎండి చైతన్య ఫస్ట్ ప్రైజ్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్ని కయ్యారు. సబ్ జూనియర్స్ షాట్ పుట్ పోటీలో పి జగదీష్, ఎన్ ప్రియాంక డిస్కస్ త్రోలో ద్వితీయ బహుమతులు గెలుపొంది బంగారు, వెండి పతకాలను సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చారని ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయురాలు కె కీర్తి ప్రశంసించారు. చిత్తూరులో ప్రతిభ చాటిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ , అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రమణ, జిల్లా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ అధికారి మధు పతకాలతో పాటు ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మరొక కార్యక్రమంలో ఏరీస్ పాలిటెక్నిక్ కాలేజీ చిత్తూరు శాఖ నిర్వహించిన ఇన్నో సైన్స్ 2025 కార్యక్రమంలో తమ విద్యార్థులు డి ఖుషిదా, వి శశాంక్(9వ తరగతి)లు సర్టిఫికెట్స్, జ్ఞాపికలతో పాటు వెయ్యి రూపాయలు నగదు బహుమతులు గెలుచుకున్నారని ప్రధానోపాధ్యాయులు శాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్ చరణ్ తేజ్, సుకుమార్, ధనంజయలు గణేష్, నాగమణి, పిజిటిలు శ్రీనివాసులు, డాక్టర్ బండి ప్రభాకర్ రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుక్క కాట్లు ఆగేదెప్పుడు?

- రోడ్డు పక్కనే సంచరిస్తున్న శునకాలు
- మాంసం దుకాణాల వ్యర్థాల కోసం పరుగులు
- వాహనాలకు అడ్డు వస్తున్న వైనం..
- ద్విచక్రవాహన దారులకు తప్పని కుక్క కాట్లు, ప్రమాదాలు..


ద్విచక్రవాహనదారుడి వెంట పడుతున్న శునకాలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల వాణిజ్య కేంద్రం కొత్తపల్లి మిట్టలో రోడ్లపై శునకాలు అటు ఇటు తచ్చాడుతున్నాయి. స్థానిక మాంసం దుకాణదారులు రోడ్డు పక్కనే వ్యర్థాలు పడేస్తుండడంతో వాటిని తినడానికి శునకాలు పరుగులు తీస్తున్నాయి. ద్విచక్రవాహనాలకు అడ్డంగా రావడంతో పలువురు కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ దారిన వెళ్లే మరి కొందరిని కుక్కలు పరుగులు పెట్టించి కరుస్తున్నాయి. దీంతో ఆ రహదారిన వాహనాలపై, నడిచి వెళ్లాలన్నా వాహనచోదకులు, పాదచారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

రోడ్డు పక్కనే సంచరిస్తున్న శునకాలు

మండల సమీప వాణిజ్య కేంద్రమైన కొత్తపల్లి మిట్ట రహదారిపై ఈ మధ్యకాలంలో కుక్కలు విపరీతంగా రోడ్డుపై వెళ్లడం వల్ల తరచూ వాహనదారులు ప్రమాదాలు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలోని పెనుమూరు , వెదురు కుప్పం, గంగాధర నెల్లూరు, ఎస్ఆర్ పురం మండల సరిహద్దులు ప్రాంతంలో కొత్తపల్లి మిట్ట వుంది. దీంతో వ్యాపార కేంద్రంగా మారింది. ఈ కారణంగా రహదారిపై వాహనాలు అధిక సంఖ్యలో వెళుతుంటాయి. కుక్కలు వాహనాలకు అడ్డంగా రావడంతో వాహనచోదకులు కిందపడి గాయాలపాలవుతున్నారు. పాదచారులను సైతం శునకాలు తరుముకుంటూ కరుస్తున్నాయని అటు వెళ్లాలంటే భయాందోళనకు గురికావాల్సి వస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మాంసం దుకాణాల వ్యర్థాల కోసం పరుగులు

ఈ వాణిజ్య కేంద్రం కొత్తపల్లి మిట్ట రహదారిపై దాదాపు 15 చికెన్ సెంటర్లు, హోటళ్లు వున్నాయి. ఈ దుకాణాలలో వచ్చే మాంసం వ్యర్థాలు, ఆహార పదార్థాలు చిత్తూరు-పుత్తూరు రోడ్డుపై కొత్తపల్లి మిట్ట సమీపంలో రోడ్డు పక్కనే పడేస్తున్నారు. కుక్కలు కోళ్ల వ్యర్థాల కోసం రోడ్డుపై యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. వేగంగా వెళ్లే వాహన దారులకు అడ్డంగా శునకాలు రావడంతో వాహనదారులు తరచూ గాయాలు పాలై ప్రమాదాలకు గురవుతున్నారు.

వెంటాడుతున్న కుక్క కాట్లు, ప్రమాదాలు

గత మూడు నెలల కాలంలో కొత్తపల్లి మిట్ట డౌన్ చర్చ్ స్కూల్ సమీపంలో ద్విచక్ర వాహనం కుక్కని ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల కాలంలో పాద చారులను, ద్విచక్రవాహన దారులతో పాటూ అక్కడ సంచరించే మేకలు, ఇతర జీవాలపై సైతం శునకాలు దాడిచేసి గాయపరిచి పరిగెత్తించి భయాందోళనకు గురి చేస్తున్నాయి. పలువురు కుక్కకాట్లకు గురై ఆస్పత్రులకు వెళ్లిన సందర్భాలు కూడా వున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారిపై కుక్కల బెడదను నివారించి రక్షణ కల్పించాలని వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు.

వెదురుకుప్పం ఎస్ఐగా జి నవీన్ బాబు


ఎస్ఐ జి నవీన్‌బాబు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురుకుప్పం ఎస్ఐగా జి నవీన్ బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు విఆర్ నుంచి ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య బదిలీ పై చిత్తూరు విఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో నవీన్ బాబు బాధ్యతలు స్వీకరించారు. మండలంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



ఎంఈవోలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లి మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్1గా ఎస్ మహబూబ్ బాషా, ఎంఈవో 2గా బి సుబ్రహ్మణ్యం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డప్పని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని విద్యాభివృద్ధి, పాఠశాలల సౌకర్యాల మెరుగుదలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం టిడిపి బైరెడ్డిపల్లి మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభం


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధ్యమవుతుందని యన్ఎంఎన్ఎఫ్ ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. జిడినెల్లూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో, అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడితోపాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం సాధించవచ్చని తెలిపారు. అంతర పంటలు వేస్తే రెట్టింపు ఆదాయం వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వాసు, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఇన్‌ఛార్జి అగ్రికల్చర్ ఏవో ఢిల్లీ ప్రసాద్, వెలుగు ఏపిఎం ఫరీద్ మస్తాన్, ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపరువైజర్ అనురాధ, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్లు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


తవణంపల్లిలో

తవణంపల్లి: తవణంపల్లి మండలంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు కన్వర్జెన్స్ మీటింగ్‌ను మంగళ వారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు, రాష్ట్ర స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. మండలంలో సమగ్రంగా ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను అమలు చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ప్రతినిధి చంద్రశేఖర్ రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవ సాయం ప్రాధాన్యత, దాని ద్వారా ఖర్చులు తగ్గిన దిగుబడులు పెరగడం, నేల ఆరోగ్యం మెరుగుపడటం వంటి అంశాలను వివరించారు. డిపిఎం వాసు హార్టికల్చర్ విభాగంలో అంతర పంటల విధానం వల్ల రైతులకు కలిగే లాభాలను వివరించారు. అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం, భూమి సారాన్ని కాపాడుకోవడం సాధ్యమ వుతుందని వివరించారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి వందనతో పాటు వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏ లు, ఏపీఎం అరుణ, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. మండ లంలో పనిచేస్తున్న ఏపీసీఎన్ఎఫ్ క్యాడర్‌లు, నూతన టీఐసీఆర్‌పీలు, ఎన్ఎఫ్ఏ ఫీజునిషా, ఎఫ్ఎంటీలు, మండల ఎంహెచ్ఓలు, వివోఏలు హాజరయ్యారు.

సోమల: సేంద్రియ ఎరువులు వాడుతూ సారవంతమైన భూములను ఏర్పాటు చేసినప్పుడే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని సోమల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ అన్నారు. నేల ఆరోగ్యం సారవంతమైన భూమి కింద కందూరులో రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు ఒక్కరోజు అవగాహన నిర్వహించారు. ప్రతి రైతు తాను పండించే పంటలకు రసాయనిక ఎరువులు మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పంటలు పండించి తింటే ప్రజలు ఆరోగ్యంగా వుంటారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

విగ్రహాలు, ఆలయాల తొలగింపు గడువు పెంపు

- సంక్రాంతి ఉత్సవాల వరకు కొండచుట్టు మండపానికి గడువు


నిర్వాహకులతో చర్చిస్తున్న ఆర్‌డివో అనుపమ

ప్రజాశక్తి -విజయపురం (నగరి): జాతీయ రహదారి వెడల్పులో భాగంగా రోడ్డు పక్కనే ఉన్న ఆలయాలు, శిలావిగ్రహాలు, మండ పాలను తొలగించాలని లేకుంటే ఈ నెల 17వ తేదీన తామే తొలగిస్తామని ఆర్డీవో అనుపమ హెచ్చరికలు జారీచేసిన సంగతి విదితమే. అయితే నెలరోజుల్లో సంక్రాంతి ఉత్సవాలు ఉండటం ఆ ఉత్సవాల్లో కొండచుట్టు మండ పానికి ప్రాధాన్యత ఉండటంతో ఉత్సవ నిర్వాహకులు, గ్రామస్తులు ఆమెను కలిసి సంక్రాంతి పండుగ వరకు గడువు ఇవ్వాలని మొరపెట్టుకున్నారు. ఈ దశలో మంగళ వారం రోడ్డు పక్కన ఆలయాలు, మండపాలు, శిలా విగ్రహాల సంబంధీకులతో ఆర్డీవో సమావేశమయ్యారు. స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. దీంతో పలు సమస్యలను సంబంధీకులు తెలపడంతో తొలగింపునకు ఒకరోజు గడువును పొడిగిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఉన్నతాధికారులతో చర్చించిన మేరకు కొండచుట్టు మండపం తొలగింపునకు వచ్చే నెల 20వ తేదీ వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం: సీడీపీవో


విద్యార్థినుల వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈవో నమశ్శివాయం

ప్రజాశక్తి -విజయపురం: చదువుకునే వయస్సులో చదువు మీద మాత్రమే ఏకాగ్రత కలిగి ఉండాలని, ఇతర ఆకర్షణలకు లోనైతే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేరని, బాల్య వివాహాలు చేసుకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయని సీడీపీవో ఇందిరాప్రియదర్శి పేర్కొన్నారు. వంద రోజుల జాతీయ ప్రచారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పన్నూరు ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తికాని ఆడ పిల్లలు ఎవ్వరు వివాహం చేసుకోకూడదని ఆమె తెలిపారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు బాల్య వివాహంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే స్థానిక అంగన్‌వాడీ, ఎఎన్ఎం, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం బాల్యవివాహంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె శ్యామల, లక్ష్మి, పీడీ అనిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని ఎంఈవో నమశ్శివాయం అన్నారు. మంగళవారం నగరి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బాల్యవివాహ్ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. సమాజంలో ఎక్కడ బాల్య వివాహాలు జరిగినా వాటిని అడ్డుకోవాలని చైల్డ్ హెల్ప్ నెంబరు 1098ను వినియోగించు కోవాలన్నారు. అనంత రం బాలికల వద్ద ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్యామిని, ఇందిర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కీములను సద్వినియోగం చేసుకోవాలి

- ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు



సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి- పలమనేరు: ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని పికెఎం ఉడా ఛైర్ పర్సన్ డాక్టరు బిఆర్ సురేష్ బాబు పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ పరిధిలోని అక్రమ లేఔట్‌లో క్రమ బద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బిపిఎస్)కు సంబంధించి నియోజక వర్గంలోని మండల తహశీల్దారు, మండల డెవలప్‌మెంట్ ఆఫీసరు, మునిసిపల్ కమిషనర్, సిబ్బంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పికెఎం, ఉడా ఛైర్ పర్సన్ డాక్టరు బిఆర్ సురేష్ బాబు మాట్లాడుతూ అనధికార లేఔట్‌లలోని ప్లాట్ కొన్న ప్రతిఒక్కరూ క్రమ బద్ధీకరణ చేసుకోవాలని సూచించారు. బిపిఎస్ ద్వారా అనుమతి పొంది ఇంటి పన్నుపై ఉన్న దీర్ఘకాలిక అనధికార రుసుముల నుండి విముక్తి పొందాలని కోరారు. నిర్మాణం అనుమతి పొందిన సమయంలో మోర్ట్ గేజ్ చేసిన స్థలాల విడుదల, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేస్తామని తెలిపారు. ఈ స్కీములను సద్వినియోగం చేసుకుని పలమనేరు పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉడా ఛైర్ పర్సన్ డాక్టరు బిఆర్ సురేష్ బాబు, మునిసిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి, పలమనేరు మండల రెవెన్యూ అధికారి ఇంబనాథన్, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలమనేరు: ఈ నెల 21వ తేదీ పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని యూపీఎస్సీ కాకా తోపు, యూపీఎస్సీ పాతపేట పరిధిలోని ఈ నెల నిర్వహించనున్న పల్స్ పోలియో గురించి బూత్ కోఆర్డినేటర్స్ కి వాలంటీర్లకు ట్రైనింగ్ ఇచ్చారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, అంగన్వాడీ ఆయాలు, ఏఎన్ఎం, ఆశాలకు, రూట్ సూపరువైజర్లకు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి సురేఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఇందులో డిసెంబర్ 21వ తేదీ ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జీరోటు 5 సంవత్సరాలలోపు పిల్లలకు రెండు చుక్కల పోలియో డ్రాప్స్ ను వేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో 25 పల్స్ పోలియో బూతులు ఏర్పాటు చేశామని ఒక ట్రాన్సిస్ట్ పాయింట్ పలమనేర్ బస్టాండ్ లో ఏర్పాటు చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకుని పోలియో వ్యాధి లేని భారతదేశం సాధించాలని కోరారు. 26 బూతులలో 4,786 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు సబ్ యూనిట్ అధికారి జయశంకర్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు. 21వ వినియోగించుకోని పిల్లలకు 22, 23 తేదీలలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని ఈ కార్యక్రమంలో భారత పౌరులందరూ తమ వంతు సామాజిక బాధ్యతగా భావించి అందరికీ తెలిపి పోలియో వ్యాధి లేని దేశ నిర్మాణం చేపడ్డారని పిలుపు నిచ్చారు.


సదుంలో

సోమల:(సదుం): డిసెంబరు 21వ తేదీ ఆదివారం సదుం మండలంలో నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేసి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పోలియో రహిత సమాజం నిర్మించేందుకు కృషి చేయాలని చెరుకు వారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి చరణ్ కోరారు. సదుం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన కలిసి పోలియో విజయవంతంపై సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదుం మండలంలో 3040 మంది 0 నుండి 5 సంవత్సరాల లోపు వయసు కలిగిన చిన్నారులు ఉన్నారని 44 బూత్‌లలో నాలుగు రూట్లలో 21వ తేదీ పల్స్ పోలియో వేస్తారని, 22 23 తేదీలలో ఇంటింటికి వెళ్లి ఎవరైనా చిన్నారులు పల్స్ పోలియో వేసుకోని వారు ఉంటే గుర్తించి వేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారిణి గాయత్రి, ఏవో సుకన్య, ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది నీలకంఠ , శికామణి, వైద్య సిబ్బంది హేమలత, సరస్వతీ, సుజాత, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనం చోరీ

ప్రజాశక్తి -బంగారుపాలెం: చోరీకి గురైన ద్విచక్ర వాహనం కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసు లు తెలిపారు. మండల కేంద్రంలోని జెండా మాను వీధిలో వున్న బాబు కుమారుడు రియాజ్ బాషా తన ద్విచక్ర వాహనం (స్కూటీ) కుసుమ హోటల్ వద్ద ఉంచి ఉదయం పరిశీలించగా ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో పరిసరాల్లో గాలించి చూశారు. వాహనం ఎక్కడ కనబడకపోవడంతో వాహన దారుడు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


పశువులకు వైద్యం అందిస్తున్న డాక్టరు

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి -సోమల: సోమల మండ లం వల్లిగట్ల పంచా యతీ కే గొల్లపల్లి గ్రామంలో పశువైద్యా ధికారిణి చందన ప్రియ ఆధ్వ ర్యంలో మంగళ వారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిం చారు. 280 పశువులకు 51 దూడలకు పిడుదుల మందు పిచికారీ, నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. 21 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ అధిక పాల దిగుబడి ఏడాదికో దూడ పెయ్యదూడల పథకం గురించి క్షుణ్ణంగా వివరించారు. అపోహలు మానాలని పశువులకు అనారోగ్యం ఏర్పడితే వెంటనే వైద్య సిబ్బందికి చూపించి వైద్యం చేయించాలని సలహాలు సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సహదేవ సురేష్ సుధాకర్ అల్తాఫ్ రైతులు పాల్గొన్నారు.


రాయితీపై ఉలవలు అందిస్తున్న నాయకులు

రాయితీపై ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీతో అందిస్తున్న ఉలువలను మంగళవారం కూటమి నేతలు పంపిణీ చేశారు. మండలంలోని అనిగానూరు సచివాలయ రైతు సేవ కేంద్రంలో రైతులకు ఐదు కేజీల చొప్పున అందించారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా అన్ని విధాల సంక్షేమాలను అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి రామ్మూర్తి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డైరెక్టర్ జయశంకర్, మనేష్, కృష్ణారెడ్డి, మహేంద్ర నాయుడు, రామలింగం, గోపాల్ రెడ్డి, మురుగేష్, ఏవో మహేష్, రైతులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు అర్బన్ సిఐగా కె మోహన్ రెడ్డి మంగళ వారం సాయంత్రం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలమనేరు అర్బన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా ట్రాఫిక్ సమస్యలు, దొంగతనాలు, గంజాయి మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాలు, లాటరీ టికెట్లు వ్యాపారం మొదలగు నేరాలు జరగ కుండా చూస్తామని, అందుకు అర్బన్ పరిధిలోని ప్రజలందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. తాగి డ్రైవింగ్ చేయరాదని తెలిపారు. లేని పక్షంలో భారీ జరిమానా, శిక్షలు భరించాల్సి ఉంటుందని తెలిపారు. రోడ్ సేఫ్టీ, లా అండ్ ఆర్డర్ పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తానని ఆయన తెలిపారు.

విద్యార్థులను మోసం చేస్తే సహించేది లేదు

ప్రజాశక్తి -పుంగనూరు: అబద్ధపు హామీలతో విద్యార్థులను మోసం చేస్తే సహించేది లేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు అన్నారు. పట్టణంలోని గోకుల్ సర్కిల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలని మంగళవారం ఆందోళన చేశారు. నిరసన తెలుపుతూ మానవహారం నిర్వహించారు. ఈ ప్రైవేట్ పరం చేయడం ద్వారా సామాన్య మధ్యతరగతి విద్యార్థులు ఎంబిబిఎస్ విద్యకు దూరమవుతారని అని చెప్పారు. వెంటనే కూటమిప్రతం నిర్ణయాన్ని మార్చుకొని ప్రైవేటు పరాన్ని విరమించుకొని ప్రభుత్వమే బాధ్యతగా చేపట్టాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాలు, యువత, మేధావి వర్గం, కలిసివచ్చే సంఘాలతో ఆందోళనలు ఉధ ృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర సమితి సభ్యులు మున్నా, జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్ పాల్గొన్నారు.

కార్వేటినగరంలో జాతర కోలాహలం


భక్తులను అలరించిన వేషధారణలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామదేవత బంగారమ్మ ఆలయంలో జాతరను పురస్కరించుకొని మంగళ వారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంకరణలు చేశారు. మండల కేంద్రంలో భక్తుల సందడి నెలకొంది. యువత, వివిధ వేషధారణలతో పిల్లలు,పెద్దలు అమ్మవారిని దర్శించు కుని మొక్కులు తీర్చుకున్నారు. బంగారమ్మ, నడివీధి గంగమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి అంబళ్లను భక్తులకు పంచిపెట్టారు. అమ్మవారి ఆలయాన్ని సుగంధ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూకట్టారు. ఆలయ ఆవరణలో ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు పంచిపెట్టారు. జాతర ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు కే ప్రసాద్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, ఉపాధ్యక్షుడు రంగనాథమొదలియార్ పర్యవేక్షించారు.

అలరించిన వేషాలు

యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మదన వేషాలు చూపరులను అలరించింది. అమ్మవారి ఆలయంతో పాటు, గ్రామ వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

ప్రశాంతతకు సహకరించండి: సీఐ

మండల కేంద్రంలో మంగళవారం నుండి బుధవారం వరకు రెండు రోజుల పాటు నిర్వహించే జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని బంగారమ్మ ఆలయ కమిటీకి సీఐ హనుమంతప్ప సూచించారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించి ఎస్ఐ తేజశ్వనితో కలిసి అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో పోలీసులను మఫ్టీలో నియమించినట్లు తెలిపారు. ప్రధాన కూడలి ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పం ఏది?

- నిరుపయోగంగా చెత్త తరలింపు వాహనం - స్పందించని అధికారులు



ప్రజాశక్తి -వెదురుకుప్పం : వెదురుకుప్పం మండలం పచ్చికా పల్లం గ్రామ పంచాయతీకి స్వచ్ఛ సంకల్పం పేరుతో మూడు చక్రాల సైకిల్ ను ప్రభుత్వం అందించింది. తడి చెత్త పొడి చెత్త స్థానికుల నుంచి సేకరించి ఈ సైకిల్ ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించి సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయం పెంచడమే ముఖ్య ఉద్దేశ్యం. పచ్చికాపల్లం మంచి విరాట పురానికి వెళ్లే దారిలో ఓ చెత్త కుప్ప వద్ద ఈ సైకిల్ నిరుపయోగంగా వుంది. అధికారులు ఎందుకు ఇలా వదిలేశారో వారికే తెలియాలి.. ప్రజా సంపదను వినియోగంలోకి తెచ్చి, పంచాయతీ ఆదాయానికి అధికారులు బాధ్యత తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.